

ప్రమాద ఘంటికలు


త్రిపురారంలో బీటలు వారిన వరి పొలం

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- గత ఏడాది డిసెంబరులో 7.84మీ., లోతుకు పడిపోయిన నీటిమట్టం
- చందంపేట, నేరడుగొమ్ము, చిట్యాలలో 11మీ., లోతుకు
- సాగర్‌లో 520అడుగుల నీటిమట్టం
- మరో 10అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజీ
- తాగునీటి అవసరాలకే సాగర్ నీటి నిల్వలు
- ఆరుతడిపై ఆశలు గల్లంతు
- హైదరాబాద్‌కు తాగునీటికి ప్రత్యామ్నాయ మార్గాలు

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడంతో ఉమ్మడి జిల్లాలో వేసవికి ముందే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రానున్న రోజుల్లో సాగునీటి సంగతి అటుంచితే తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుతం 520అడుగులుగా ఉంది. మరో 10 అడుగుల నీటి మట్టం తగ్గితే డెడ్ స్టోరేజీకి చేరనుంది. సాగర్ నీటి నిల్వలను తాగునీటి అవసరాల కోసమే ఇకపై విని యోగించనున్నారు.

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఏకేబీఆర్(అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి హైదరాబాద్‌కు ప్రతీ రోజు మూడు మోటార్ల ద్వారా రోజుకు 1,350క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తు న్నారు. నల్లగొండ జిల్లాకు ప్రతీ రోజు మిషన్ భగీరథ ద్వారా 45క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న రోజుల్లో అంటే నిండు వేసవిలో నీటి ఎద్దడి తీవ్ర మయ్యే అవకాశాలు ఉండటంతో పీఏపల్లి మండలం పుట్టం గండి వద్ద అత్యవసర మోటార్లకు మరమ్మతులు చేసే పనిలో అధికారులు ఉన్నారు. సాగర్ 510 అడుగులకు నీటి మట్టానికి పడిపోతే అత్యవసర మోటార్ల ద్వారా నీటిని సర ఫరా చేస్తారు. 506అడుగుల నీటిమట్టం సాగర్‌లో ఉన్న ప్పుడు ఈ మోటార్ల ద్వారా నీటి కేటాయింపులు ఉంటాయి. పదేళ్ల క్రితం ఇదే పరిస్థితి ఎదురైంది. సాగర్ ప్రాజెక్టులో జీరో అంటే 450అడుగుల నీటిమట్టం ఉన్నా తాగునీటి అవ సరాల కోసం జలాశయానికి ఆనుకొని ఉన్న సుంకిశాల ప్రాంతం నుంచి మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటికే సాగర్ ఆయకట్టు కింద సాగునీటి శాఖ అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించ డంతో ఆరుతడి సాగుపైనా ఆశలు గల్లంతయ్యాయి.

యాసంగిలో సాగుకు తీవ్ర ఇబ్బందులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు లేక ఎడమ కాల్వ కింద నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. గత వానా కాలంతో పాటు యాసంగి సీజన్‌లో ఆయకట్టు రైతులు నాట్లు వేయలేదు. ఏఎమ్మార్పీ, డిండి ప్రాజెక్టుల పరిధిలో సైతం నాట్లు పడలేదు. మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో మాత్రం 32వేల ఎకరాల్లో నాట్లు పడగా, మిగతా రైతులు బోర్లు, బావులు ఆధారంగా నాట్లు వేశారు. అయితే వేస విలో బోర్లు ఎండినా, కరెంట్ కోతలు విధించినా వరి చేతికి రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోర్లలో నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వరి పొట్టదశ వచ్చేసరికి నీరు సరిపోతుందో లేదో అని రైతులు వాపోతున్నారు. యాసంగి సీజన్ గత ఏడాది నవంబరు 15 నుంచి ప్రారంభమైంది. మార్చి లేదా ఏప్రిల్ నాటికి పంట చేతికి రానుంది. వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు నిండక భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. సాగర్ ఎడమ కాల్వ కింద 1.80లక్షల ఆయకట్టు ఉండగా, ఈసారి బోరుబావుల కింద ఆయకట్టులో 30వేల ఎకరాలకు మించి వరి సాగుకాలేదు. ఏఎమ్మార్పీ హైలెవల్, లోలెవల్ ప్రాజె క్టుల్లో నీటి నిల్వలు లేవు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 5.86లక్షల ఎకరాలు సాగుకావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2.99లక్షల ఎకరాల్లో మాత్రమే వరితోపాటు ఇతర పంటలు సాగయ్యాయి. వరి 2.73లక్షల ఎకరాల్లో సాగు కాగా, 20వేల ఎకరాల్లో వేరుశనగ, 6వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, ఆముదం, మినుము, బొబ్బెర, పెసర పంటలు సాగయ్యాయి. ఈ నెలాఖరులోగా యాసంగి సీజ న్ ముగియనుండగా, మరో 40వేల ఎకరాలకు మించి పంటలు సాగయ్యే పరిస్థితి కానరావడం లేదు.

7.84మీటర్లకు పడిపోయిన భూగర్భ జలాలు

నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 651.4మి.మీ సాధారణ వర్షపాతానికి, 530.4మి.మీ వర్షపాతం నమోదైంది. 18.6మి.మీ., లోటువర్షపాతం ఉంది. అత్యధికంగా 14మండ లాల్లో లోటు వర్షపాతంగా నమోదైంది. వర్షాభావ పరిస్థి తుల నేపథ్యంలో భూగర్భ జలాలు పడిపోగా, మరో రెండు నెలల్లో పరిస్థితి దారుణంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. 2022 ఏడాదితో పోలిస్తే 2023 డిసెంబరు నెలాఖరు వరకు నల్లగొండ జిల్లాలో 7.84మీ., లోతుకు నీటి మట్టాలు పడిపో యాయి. 2022 డిసెంబరులో 4.65మీ., లోతులో జలపాతం ఉండగా, 2023లో 7.84మీ., లోతులో భూగర్భ నీటిమట్టం ఉంది. ఏడాదిలో 3.19మీ., కిందికి నీటిమట్టాలు పడిపో యాయి. చందంపేట, నేరడుగొమ్ము, చిట్యాల మండలాల్లో 11మీ., లోతుకు నీటిమట్టాలు పడిపోయాయి.

నల్లగొండ జిల్లాలో డివిజన్ల వారీగా భూగర్భ జలమట్టం..

డివిజన్	2022 డిసెంబర్‌లో..	2023 డిసెంబర్‌లో..
నల్లగొండ	4.51 మీటర్లు	7.23 మీటర్లు
మిర్యాలగూడ	4.60 మీటర్లు	7.66 మీటర్లు
దేవరకొండ	4.86 మీటర్లు	8.24 మీటర్లు

● ఇంత కరువు ఎన్నడూ చూడలే



20 ఏళ్లగా ఇంత కరువు ఎన్నడూ చూడలేదు. బోరు బావుల ఆధారంగా కొంతమేర వరి సాగు చేశా. కనీసం ఆరుతడికి నీళ్ల వదులుతారని ఆశతో సాగు చేశాం. కానీ సాగర్ ప్రాజెక్టులో నీళ్ల అడుగంటిపోవడంతో ఆశలు నీరుగారాయి. ఈ యాసంగిలో వేసిన పంట చేతికి వచ్చే అవకాశాలు కనబడటం లేదు. ఆయకట్టు కింద లక్షలాది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

సయ్యద్, రైతు, త్రిపురారం



పట్టు సాగు తగ్గుతోంది

తగ్గిన దిగుబడి, ధర ● ఐదేళ్లుగా అందని బోనస్
సాగు మానేస్తున్న రైతులు

మోత్కూరు, జనవరి 24: వాతావరణం అనుకూలిం చక, గిట్టుబాటు ధర లభించక రైతులు ఏ పంట సాగు చేసినా నష్టాలనే చవిచూస్తున్నారు. కొత్త పంట సాగు సమయంలో కొంత ఆశాజనకంగా ఉన్నా, ఆ తరువాత దిగుబడి, ధర తగ్గి నష్టపోతున్నారు. పట్టు పురుగుల పెం పకం కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. పట్టు పురు గుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని, షెడ్ నిర్మా ణానికి సబ్సిడీ, కిలో పట్టుగూళ్లకు రూ.75 చొప్పున బోనస్ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. ఏడాదికి ఏడెనిమిది పంటలు తీయవచ్చని సెరికల్చర్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో పలువురు రైతులు వరి, పత్తి, కంది లాంటి సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి దశాబ్ద కాలంగా మల్బరీ సాగు (పట్టు పురుగుల పెంపకం) చేప ట్టారు. మొదట్లో సాగు లాభదాయకంగానే ఉన్నా, ఇటీవల పురుగులు గూళ్లు కట్టకపోవడం, పట్టు గూళ్ల ధర బాగా పడిపోవడం, ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో పట్టు రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మోత్కూరు మండలంలో 100ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది.

గూళ్లు అల్లని పురుగులు

వారం ఎదిగిన పట్టు పురుగులను తెచ్చి రైతులు షెడ్లలో వేసి మల్బరీ ఆకులను మేతగా ఇస్తారు. మూడు వారాల్లో అవి పట్టుగూళ్లను అల్లుతాయి. గూడు అల్లడం మొదలు పెట్టగానే రైతులు వాటిపై చంద్రికలు పరుస్తారు. నాలుగైదు రోజుల్లో గూళ్ల అల్లిక పూర్తవుతుంది. ఆరో రోజున వాటిని వేరు చేసి, ఏడో రోజున మార్కెట్‌కు తర లించి విక్రయిస్తారు. అయితే ఐదారు మాసాలుగా పట్టు పురుగులు గూళ్లు అల్లడం లేదు. గతంలో 100గుడ్ల పురు గులు పెంచితే 85 నుంచి 90కిలోల వరకు దిగుబడి రాగా, ప్రస్తుతం 60 నుంచి 65కిలోలకు పడిపోయింది.

నాణ్యతపై అనుమానాలు

రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది రాష్ట్రాల్లో రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. దిగుబడి తగ్గడానికి విత్తన నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పురుగులు గూళ్లు కట్టని విషయాన్ని శాస్త్రవేత్తలు కూడా గుర్తించి కార ణాలను అన్వేషిస్తున్నారు. షెడ్ల చుట్టూ వరి, పత్తి లాంటి పంటలు వేసి, వాటికి అధికంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తే ఆ మందుల ప్రభావంతో పట్టు పురుగులు గూళ్లు అల్లడం లేదని అధికారులు చెబుతున్నారు.

బాగా తగ్గిన ధర

గత ఏడాది పట్టుగూళ్ల ధర కిలో రూ.750 ఉండగా, ఇప్పుడు రూ.470కి పడిపోయింది. ఒక్కో రైతు పంటకు 250 నుంచి 300 వరకు పురుగులు పెంచుతారు. 250 పురుగులు పెంచే రైతుకు గతంలో 215 కిలోల దిగుబడి సాధించగా, ప్రస్తుతం 165కిలోలే వస్తోంది. ధర గతంలో కిలో రూ.750 చొప్పున 215 కిలోలకు రూ.1,61,250 వచ్చేవి. ప్రస్తుతం కిలో రూ.470 చొప్పున 165 కిలోలకు రూ.77,550 మాత్రమే వస్తోంది. సగానికిపైగా ఆదాయం తగ్గింది.

రైతులకు అందని బోనస్

పట్టు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కిలోకు రూ.75 చొప్పున బోనస్ ఇవ్వాల్సి ఉండగా, 2018 నుంచి వాటిని చెల్లించడం లేదు. ఒక్కో రైతుకు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు బోనస్‌గా రావాల్సి ఉంది. దిగుబడి, ధర తగ్గడం, ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో కొందరు రైతులు మల్బరీ తోటలను తొలగిస్తుండగా, మరి కొందరు నష్టాలను చవిచూస్తూ అలానే కొనసాగిస్తున్నారు.

రూ.2.50లక్షల బోనస్ రావాలి



సుమారు దశాబ్దకాలానికి పైగా మల్బరీ సాగు చేస్తున్నా. ఐదారు మాసాలుగా దిగుబడి తగ్గింది. పట్టు గూళ్ల ధర కూడా పడిపోయింది. 2018 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల బోనస్ రావాలి. నూతన ప్రభుత్వమైనా మా సమస్యలు పరిష్కరించాలి.

బండ విజయ్‌రెడ్డి, పట్టు రైతు, పాటిమట్ల

ప్రజల అవసరాలకనుగుణంగా..
బడ్జెట్ అంచనాలు

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 23: మునిసిపాలి టీలు ప్రజల అవసరాలకనుగు ణంగా ఉండేట్లు అంచనా బడ్జెట్ రూపొందించాలని కలె క్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, ఏ.వెంకట్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మునిసిపాలి టీల్లో ఎలాంటి నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ నాన్ వెజ్ మార్కెట్, మురుగునీటిశుద్ధి జలభాండాగారాలు, వైకుంఠధామాలు, దోబీఘాట్ల పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రానున్న ఏడాదికి స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా ఉత్తమమైన ర్యాంకు సాధించేందుకు తగిన ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ఆదిశగా పని చేయాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకణ కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తి చేయాల న్నారు. పట్టణాల్లో ఆస్తిపన్ను సకాలంలో పూర్తిచేయాలని, ఆ దిశగా స్పెషల్‌డ్రైవ్ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్లు రామాంజులరెడ్డి, వెంకటేశ్వర్లు నాయక్, దండు శ్రీను, వెంకటేశ్వర్లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గవర్నర్‌నుంచి అవార్డు అందుకోనున్న కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్): నేడు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలోని ఆడిటోరియంలో శాసనసభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ గవ ర్నర్ తమిళిసైసౌందర్‌రాజన్ నుంచి అవార్డు అందుకోనున్నారు. జిల్లాలో శాసనసభ ఎన్ని కల సమయంలో సమర్థంగా నిర్వహించినందుకు అవార్డుకు ఎంపికయ్యారు.

పనిలో నైపుణ్యం ఉండాలి : ఎస్పీ

సూర్యాపేటక్రైం, జనవరి 24: పనిలో నైపుణ్యం ఉండాలని, జట్టుగా పనిచేసి లక్ష్యా లను సాధించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని, డీఎస్పీలు నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. మహిళా సంబం ధిత కేసులు, మిస్సింగ్ కేసుల్లో అలసత్వం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా బాధితులకు త్వరగా న్యాయం జరిగి, నేరస్తులకు శిక్షలు పడితే మహిళలపై జరిగే దాడులు, నేరాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, డీసీ ఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌లు రాజేష్, మహేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సీఐలు శివశంకర్, రాజశేఖర్, మురారి, రాము, వీరరాఘవులు పాల్గొన్నారు.

పాలేరు నుంచి నీటిని అందించాలి


ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

మోతె, జనవరి 24: పాలేరు రిజర్వాయర్ నుంచి మోతె మండల పరిధిలో ఉన్న గ్రామాలకు లిఫ్ట్ ద్వారా తక్షణమే నీటిని అందించా లని రైతులు డిమాండ్ చేశా రు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని గోల్ తండా గ్రామ సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ కాల్వ వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతులు, మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మోతె మండలం పూర్తిగా కరువుతో అల్లాడుతోందన్నారు. గత ప్రభుత్వంలోనూ నీటికోసం ధర్నాలు చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎస్సారెస్పీ నీరు అందడంలేదన్నారు. మండలంలోని అప్ప న్నగూడెం, రావిపహాడ్, బుర్కచర్ల, హుస్సేనాబాద, విభళాపురం గ్రామాల పరిధిలో ఉన్న కాల్వలకు కనీసం ఇప్పటివరకు చుక్క నీరు రాలేదన్నారు. నీరులేక మిరపతోటలు ఎండిపో తున్నాయని, ఇప్పటికైనా ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని అందించి అక్రమంగా కాల్వలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే 29 గ్రామాల రైతులతో కలిసి ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతులు నగేష్, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ వైస్‌చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

● హుజూర్‌నగర్‌లో రసవత్తరంగా అవిశ్వాస రాజకీయం ● 28మంది కౌన్సిలర్లలో 24మంది హాజరు ● అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన 22మంది కౌన్సిలర్లు ● ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లూ అవిశ్వాసానికి మద్దతు


మున్సిపల్ అవిశ్వాస సమావేశంలో చేతులెత్తిన కౌన్సిలర్లు

హుజూర్‌నగర్, జనవరి 24: హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మునిసిపల్ కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వరరెడ్డి సమక్షంలో బుధవారం అవిశ్వాస సమావేశం నిర్వహించారు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 28 స్థానాలకు సీపీఎం ఒకటి, కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 20 స్థానాలు కైవసం చేసుకున్నాయి. చైర్మన్ గెల్లి అర్చన, వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావులు బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మునిసి పాలిటీలో జరుగుతున్న ప్రతి పనిలో ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. మున్సిపాలిటీ విషయాలను అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న సైదిరెడ్డికి వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరావు చెబుతు న్నారని, దీంతో నాటి ఎమ్మెల్యే మున్సిపాలిటీలో జోక్యం చేసుకుని చైర్మ న్‌ను, కౌన్సిలర్లను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ చైర్‌పర్సన్ వర్గీ యులు అవిశ్వాసానికి తెరలేపారు. గత మూడు నెలలుగా అవిశ్వా సంపై చర్చ జరుగుతుండగా గత అసెంబ్లీ ఎన్నిల వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అవిశ్వాసాన్ని నిలుపుదల చేయిం చారు. ఎన్నికలకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనతో పాటు మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో అవిశ్వాస వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం మునిసిపాలిటీలో సీపీఎం 1, కాంగ్రెస్ 18, బీఆర్ఎస్ నుంచి తొమ్మిదిమంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావుపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలని డిసెంబరు 30వ తేదీన కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన 18మంది కౌన్సిలర్లు గత ఏడాది డిసెంబరు 30వ తేదీన జిల్లా కలెక్టర్ వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఈ నెల 24వ తేదీన వైస్ చైర్మన్ అవిశ్వాస సమావేశం నిర్వహించాలని జనవరి 6వ తేదీన కలెక్టర్ నోటీస్ జారీచేశారు. అవిశ్వాస సమావేశానికి గడువు దగ్గర పడుతుండగా, రెండురోజుల పాటు ఏపీ రాష్ట్రంలోని విజయ వాడలోని ఓ హోటల్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన 18మంది క్యాంపునకు వెళ్లారు. బుధవారం ఉదయం 10గంటలకు క్యాంప్ శిబిరం నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వరరెడ్డి అవిశ్వాస సమావేశాన్ని ప్రారంభించగా 28మందికి గాను 24మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానానికి 19మంది మద్దతు కావల్సి ఉండగా, సీపీఎం 1, కాంగ్రెస్ 18, బీఆర్ఎస్ నుంచి ముగ్గురు మొత్తం 22మంది చేతులెత్తగా, మంజుల, వీరయ్య వ్యతిరేకించారు. బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కేఎల్ఎన్‌రావు, మంగమ్మ, గుండా పణి గైర్హాజరయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అవిశ్వాసానికి ఓటు వేసేందుకు ఎక్స్-అఫీషియో సభ్యుడిగా నమోదు చేసుకున్నా అవిశ్వాసా నికి సరిపడా కౌన్సిలర్లు ఉండడంతో ఆయన సమావేశానికి రాలేదు. వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గటంతో తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీవో జగదీశ్వరరెడ్డి తెలిపారు.

చిమిర్యాల సహకార చైర్మన్‌గా రఘుపతి


రఘుపతికి నియామకపత్రం అందజేస్తున్న జిల్లా సహకార అధికారి శ్రీధర్

కోదాడ రూరల్, జనవరి 24: మండలంలోని చిమిర్యాల సహకార పరపతి సంఘం చైర్మన్‌గా కొత్త రఘుపతి, వైస్ చైర్మన్‌గా పత్తిపాక రామకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిమిర్యాల సహకార పరపతి సంఘం సమావేశం డీసీవో శ్రీధర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశానికి 11 మంది డైరెక్టర్లు హాజర య్యారు. గత చైర్మన్‌గా ఉన్న ముత్తవరపు రమేష్, వైస్ చైర్మన్ గడిపూడి పుష్పావతిలపై అవిశ్వాసం పెట్టి తొలగించడంతో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకోసం నోటిఫికేషన్ జారీచేశారు. దీంతో చైర్మన్ అభ్యర్థిగా చిమిర్యాల గ్రామానికి చెందిన కొత్త రఘుపతిని కనగాల నర్సిం హారావు, ముంద్రా నర్సింహారావులు బలపర్చారు. వైస్ చైర్మన్ గా పత్తిపాక రామకృష్ణను ముంద్రా నరేష్, గద్దె నరేందర్‌లు బలపర్చగా, చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులకు ఎవరూ పోటీ రాకపోవడంతో ఇరువురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా సహ కార అధికారి శ్రీధర్ ప్రకటించారు. ఎమ్మెల్యే పద్మావతితోపాటు కాంగ్రెస్ నేతల సూచనల మేరకు రఘుపతి, రామకృష్ణలు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక సందర్భంగా ఎలాంటి సంఘట నలు జరగకుండా సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందో బస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రఘుపతి మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో చిమి ర్యాల సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు.

నేటినుంచి జాన్‌పహాడ్ ఉర్సు

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ● దర్గాకు మంత్రి ఉత్తమ్ రేపు రాక


విద్యుత్ దీపాల వెలుగులో జాన్‌పహాడ్ దర్గా

పాలకవీడు, జనవరి 24: పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా వద్ద ముమ్మర ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. దర్గా పరిసరాల్లో పంచాయతీ రాజ్ అధికారులు బ్లీచింగ్ చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటు న్నారు. దర్గా పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంక రించారు. జాన్‌పహాడ్ దర్గాకు ఇరువైపులా, దామరచర్ల వైపు, నేరేడుచర్ల వైపు 15 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. దర్గా ఉర్సు ఉత్సవాలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుం టున్నట్లు ఎస్‌ఐ లింగయ్యగౌడ్ తెలి పారు. 450 మంది పోలీసులతోపాటు రెండు స్పెషల్ ఫోర్స్ టీంలతో బందో బస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా దర్గాకు మంత్రి ఉత్తమ్ ఈ నెల 26న రానున్నట్లు అధికారులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పన

మూడు రోజులపాటు జరిగే ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రాత్రిపూట నిరంతరా యంగా విద్యుత్ సరఫరా ఉండేం దుకు గాను ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాట చేశారు. నిరంతరా యంగా తాగునీటిని అందించేందుకు దక్కన్ సిమెంటు యాజమాన్యం ముందుకు వచ్చింది. అదే విధంగా భక్తు లకు 20 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

శాఖల వారీగా సేవలు

శాఖలవారీగా ఎవరికి వారు ప్రత్యేక స్టాళ్లు, కౌంటర్లు ఏర్పాటు చేసుకొని సేవలందించనున్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖలు దర్గాకు చేరుకొని ఏర్పాట్లు చేస్తున్నాయి. ఆర్టీసీ సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడల నుంచి ప్రత్యేక బస్సులు నడపనుంది.

యాదగిరిక్షేత్రంలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

నిత్యాదాయం రూ. 16.80లక్షలు

యాదగిరిగుట్ట, జనవరి 24: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమశాస్త్ర రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయంలో కొలువైన స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొపిన అర్చకులు పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిత్య తిరుకల్యాణం సంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామి ఆశీస్సులు అందజేశారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యపూజలు, యాగశాలలో నిత్యరుద్ర హవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. స్వామిని సుమారు 10వేలకు పైగా మంది భక్తులు దర్శించుకోగా, ఆలయ ఖజానాకు రూ.16,80,479 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

కుమారుడిని హత్యచేసిన తల్లికి జీవితఖైదు

- సహకరించిన ప్రియుడికీ శిక్ష
- తీర్పు చెప్పిన నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్టు

నల్లగొండ టౌన్, జనవరి 24: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని కుమారుడిని హత్యచేసిన తల్లికి, అందుకు సహకరించిన ప్రియుడికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్ఐ కంచర్ల భాస్కరరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం బుద్దారం గ్రామానికి చెందిన పలేటి విజయ, వెంకన్న దంపతులకు ఇద్దరు కుమారులు అఖిల్, నాగరాజు ఉన్నారు. విజయ అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని చిన్న కుమారుడు నాగరాజు(9 సంవత్సరాలు) గమనించి తండ్రికి చెబుతానన్నాడు. దీంతో ఆగ్రహించిన విజయ, వెంకట్‌రెడ్డి 2020 ఫిబ్రవరి 21వ తేదీన బాలుడిని ఇంట్లోనే టవల్‌తో గొంతు నులిమి చంపేశారు. అయితే బాలుడి మెడపై నల్లటి మచ్చలు ఉండడాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి సీఐ ఎస్‌కె. మహబూబ్‌పాష కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 90 రోజుల అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన విజయను భర్త అంగీకరించకపోవటంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. వెంకటరెడ్డి గ్రామంలోనే ఉంటున్నాడు. ఈ కేసుకు సంబంధించి సాక్షులను విచారించిన జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం. నాగరాజు నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు బుధవారం చెప్పారు.

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమిచ్చినా కాంగ్రెస్‌కు క్రరుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.



బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్ల అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.



మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన ఆడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుకమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

బాలికల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జీ పి.శ్రీవాణి ● జిల్లా వ్యాప్తంగా జాతీయ బాలికా దినోత్సవం

సూర్యాపేటలీగల్, జనవరి 24: బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జీ పి.శ్రీవాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఇమాంపేటలోని గురుకుల బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులను గౌరవంగా చూడాలని, మంచి స్నేహితులు ఉన్నప్పుడు జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. స్నేహితులు హద్దుల్లో ఉండాలన్నారు. సదస్సులో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి జ్యోతిపద్మ, కళాశాల ప్రిన్సిపాల్, న్యాయవాదులు జె. శశిధర్, వసంత సత్యనారాయణపిళ్లై, బి.వెంకటరత్నంపాల్గొన్నారు.



గరిడేపల్లి: పానుగోడు పాఠశాలలో సేవ్ ఆకారంలో విద్యార్థినీవిద్యార్థులు

ఆత్మకూర్(ఎస్): జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్, ఏనుబాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. బాలికల పట్ల సమాజంల పాత్ర ఎలా ఉంది? అనే అంశంపై బాలికలకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు ఎంఈవో డి.ధారసింగ్ బహుమతులు అందజేశారు. ముందుగా నెమ్మికల్ గ్రామంలో లింగ వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆత్మకూర్(ఎస్) కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు ప్రిన్సిపాల్ సరస్వతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ఇన్‌చార్జి లలిత, క్లస్టర్ ఆర్గనైజర్ నాయిని సైదులు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్)లోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సరస్వతి

మఠంపల్లి: ఆడపిల్లలకు సమాజంలో గౌరవం లభించేలా, వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మఠంపల్లి ఎంపీపీ ముడావత్ పార్వతికొండానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో చత్రునాయక్, ఎంపీడీవో మామిడి జానకిరాములు, ఎంపీవో ఆంజనేయులు, ప్రిన్సిపాల్ మంజుల ,డాక్టర్లు సుధాకర్‌నాయక్, నాగేందర్,అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ పి.శ్రీవాణి

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని కస్తూర్బా కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిత, ఉపాధ్యాయునులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: ఆడపిల్లలను ఎదగనిద్దాం.. చదవనిద్దాం.. అని హెచ్ఎం వై.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని పానుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు సేవ్ గర్ల్ ఆకారంలో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు



మఠంపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

మహాధర్నాను విజయవంతం చేయాలి

సూర్యాపేట టౌన్, జనవరి 24: నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3వ తేదీన ఢిల్లీలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణే లక్ష్యంగా ప్రధాని మోదీ నూతన విద్యా విధాన చట్టం-2020 తీసుకువస్తున్నారని ఆరోపించారు. కాలేజీల్లో, యూనివర్సిటీల్లో, పరిశోధన సంస్థల్లో స్వయంప్రతిపత్తిని తొలగించి విద్యార్థుల, ఉపాధ్యాయుల, అధ్యాపకుల హక్కులను కాలరాసే చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, రహీం, సంపత్, శివ, బాను, సంతోష్, చరణ్, వేణు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలి

అర్వపల్లి, హుజూర్‌నగర్, సూర్యాపేట టౌన్, నాగారం, జనవరి 24: దేశ రాజధాని ఢిల్లీలో వామపక్షాల పార్టీలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే ట్రాక్టర్ల, బైక్ ర్యాలీలను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మూరగుండ్ల లక్ష్మయ్య బుధవారం అర్వపల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వజ్జె శ్రీనివాస్, బొడ్డు శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.

● కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 26వతేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే వాహనాల ర్యాలీని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ కోరారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో జరిగిన సమావేశంలోమాట్లాడారు.

● నాగారం మండల కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించే ట్రాక్టర్ ఎడ్ల బండ్ల ర్యాలీని విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య కోరారు. నాగారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేటి నుంచి మహబూబా ఉర్సు జాతర

పెన్‌పహాడ్, జనవరి 24: మండలంంలోని దూపహాడ్ గ్రామంలో ఈ నెల 25 నుంచి 27 వరకు మహబూబా ఉర్సు జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ జాతరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. గురువారం అర్ధరాత్రి పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా నుంచి గంధాన్ని భారీ ఊరేగింపుతో తీసుకురానున్నారు. జాతరకు వచ్చిన భక్తులందరికీ మౌలిక సదుపాయాలు కల్పించినట్లు నిర్వాహకులు గోపగాని వెంకటేశం లక్ష్మమ్మ, గోపగాని హుస్సేన్, గురువయ్య, సైదులు, లక్ష్మీనారాయణ తెలిపారు.

కాసరబాదలో..

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మండలం కాసరబాద గ్రామ శివారులో ఉన్న దంతాల దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఈ నెల 25 నుండి 27 వరకు జరగనున్నాయి, గురువారం సాయంత్రం నుండే ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి, దంతాల కుటుంబం నుంచి గంధం రాకతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

పుల్లారెడ్డి చెర్వు నాలాలో వ్యర్థాల తొలగింపు

సూర్యాపేట సిటీ, జనవరి 24: జిల్లా కేంద్రంలోని పుల్లారెడ్డి చెర్వు నాలా వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను మునిసిపాలిటీ అధికారులు బుధవారం తొలగింపజేశారు. ఈ ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోయినందున దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయం వివరిస్తూ 'పేటలో పడకేసిన పారిశుధ్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 24న ప్రచురితమైన వార్తకు మునిసిపల్ అధికారులు స్పందించారు. మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ ఎం.సురేష్, ఇరిగేషన్ ఏఈ కె.సుమంత్ పర్యవేక్షణలో పుల్లారెడ్డి చెర్వు సమీపంలోని నాలాలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను ఒక వైపు ఎక్స్‌కవేటర్, మరో వైపు మునిసిపాలిటీ సిబ్బందితో తొలగింప జేశారు.

కార్మిక రంగాన్ని కాపాడతాం: ఐఎన్‌టీయూసీ

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 24: కార్మిక రంగాన్ని కాపాడుతామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మంత్రి ఉత్తమ్ క్యాంప్ కార్యాలయంలో వివిధ సంఘాలకు చెందిన 200మందిఆటో యూనియన్ కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గురవయ్య, రాము పాల్గొన్నారు.

కోదాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే

కోదాడ రూరల్, జనవరి 24: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం డ్రైవర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంవీఐ ఆర్.బాబు హాజరై డ్రైవింగ్, పార్కింగ్, రోడ్డు నియమాల పట్ల పలు సూచనలు అందజేశారు. డిపోలో ప్రమాద రహిత డ్రైవర్ ఆర్.సైదులును సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీహర్ష, అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు, ఎస్ఎస్ రావు పాల్గొన్నారు.

సుధా బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్, జనవరి 24: సుధా బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ చైర్మన్, నీలా మహదేవ్, ఎండీ పెద్దిరెడ్డి గణేష్ కోరారు. బుధవారం పట్టణంలోని సుధా బ్యాంక్ ఆవరణలో ఖాతాదారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 6 శాఖలతో 24 సంవత్సరాలుగా ఇతర బ్యాంకుల కంటే మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నిర్మల, డైరెక్టర్ చంద్రశేఖర్, మాశెట్టి అనంతరాములు, పొలిశెట్టి నర్సింహారావు, గజ్జి ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాముడి పేరుతో మోదీ రాజకీయం: సీపీఎం

సూర్యాపేట సిటీ, జనవరి 24: రాముడి పేరుతో ప్రధాని మోదీ రాజకీయం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన జిల్లా కేంద్ర కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మేకనబోయిన శేఖర్, నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

కోదాడ రూరల్, జనవరి 24: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ బార్కస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ కలీం, కలీం అన్నారు. బుధవారం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ దశరథ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నెం.55ను రద్దు చేయాలి

సూర్యాపేటక్రైం, జనవరి 24: వ్యవసాయ, హార్టికల్చర్ యనివర్సిటీల్లో 100 ఎకరాల భూమిని నూతన హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసి జీవో నెం.55ను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునివ్వగా ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

జీఎస్టీ బిల్లులను తిరిగి చెల్లించాలి



తిరుమలగిరి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి, జనవరి 24: దళితబంధు పథకంలో లబ్ధిదారుల నుంచి జీఎస్టీ పేరిట అక్రమంగా వసూలు చేసిన బిల్లులను ఏజెన్సీలు తిరిగి చెల్లించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళిత బంధు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన తిరుమలగిరి మండలంలో జీఎస్టీ పేరిట వసూలు డబ్బులను చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ విషయాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతానన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీతో ఫోన్‌లో మాట్లాడి దళితబంధు లబ్ధిదారుల నుంచి జీఎస్టీ వసూలు చేసిన ఏజెన్సీల వివరాలను ఐదు రోజుల్లో తనకు పంపాలని ఆదేశించారు. విధులు సరిగా నిర్వహించడంలేదని ఫిర్యాదులు వచ్చినందున, అర్వపల్లి ఎంఈవో బాలునాయక్‌కు విధులు నుంచి తొలగించాలని డీఈవో అశోక్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ప్రజల అవసరాలకు మినహా ఇసుక తరలిస్తే అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. 2021-23 సంవత్సరాల్లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, మిల్లర్లు చెల్లించాల్సిన సీఎంఆర్ బియ్యం వివరాలు ఇవ్వాలని ఏపీఎంను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న చెక్‌డ్యాంలను పూర్తిచేయాలన్నారు. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా తిరుమలగిరి, తాటిపాముల, అనంతారం, నందాపురం, తొండ, మాలిపురం గ్రామాలకు సాగునీటిని అందించేందుకు కృషిచేస్తానన్నారు. తిరుమలగిరిలో జాతీయ రహదారిలో భాగంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, రోడ్డు విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికను సీఎం దృష్టికి తీసుకువెళతానని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీసుజాత, జడ్పీటీసీ దూపటి అంజలి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీవో ఉమేష్‌చారి, ఎంపీవో మారయ్య, ఏవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి: ప్రజాపంథా

సూర్యాపేటటౌన్, జనవరి 24: సూర్యాపేట మునిసిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సూర్యాపేట మునిసిపాలిటీలో జరిగిన ప్రతి అభివృద్ధి పనులను ఒకే కాంట్రాక్టర్‌కు కట్టబెట్టిందని ఆరోపించారు. . జిల్లా కేంద్రంలోని పాత మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపించిందని, ఎన్నికల ముందు హడావిగా రోడ్డును నిర్మించడంతో, కొద్దిరోజులకే గుంతలు పడ్డాయన్నారు. మినీ ట్యాంక్‌బండ్ పనులు నేటికీ పూర్తి కాలేదన్నారు. జిల్లా కేంద్రంలోని అండర్‌పాస్ డ్రైనేజీ, సీసీ రోడ్ల సహా పలు అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందని, సిట్టింగ్ జడ్జీతో వెంటనే విచారణ చేయించి, సంబంధిత కాంట్రాకర్‌పై, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, భూక్యా రాంజీ, చంద్రకళ, వీరబోయిన రమేష్, సయ్యద్, సూరం రేణుక, జయమ్మ, గులాంహుస్సేన్, వాజిద్, లింగయ్య, లక్ష్మి, పద్మ, రాజేష్, చిరంజీవి, గౌరమ్మ, చిట్టి పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి



జిల్లా కేంద్రంలోని 31వవార్డు కౌన్సిలర్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల మహిళా నాయకులు

సూర్యాపేటటౌన్, జనవరి 23: మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాం ప్రకటించడం సరికాదని, ఆ తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 31వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి ఇంటి ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణపై అవిశ్వాసం ప్రకటించడం సరికాదన్నారు. ఓ దళిత మహిళా మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించడం వివక్షకు నిదర్శనమన్నారు.అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు రాస్తారోకో చేస్తున్న దళితసంఘాలమహిళాలను అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో దళిత సంఘాల మహిళా నాయకులు, బొడ్డు రజిని, కంచె సరిత, జయమ్మ, షేక్ బాను, బొల్లేద్దు విజయ, నీలమ్మ పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ బలవన్మరణం

భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు



సైదులు (ఫైల్ ఫొటో)

పెన్‌పహాడ్, జనవరి 24: కుటుంబ కలహాల నేపథ్యంలో మండలంలోని ధర్మాపురంలో ఓ ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. డీఎస్పీ నాగభూషణం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మాపురం గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ అర్రూరి సైదులు(41) జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు ఎస్పీ వద్ద డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య పార్వతితో కలిసి సూర్యాపేటలోని అంజనాపురి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. కుమార్తె సాయిపూజిత మహబూబునగర్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం, కుమారుడు సాయిపవన్ హైదరాబాద్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. సైదులు దంపతుల మధ్య కొన్ని నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంతో భార్య పార్వతి వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లింది. అప్పటినుంచి సైదులు మనస్తాపంతో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి సైదులు తన ద్విచక్రవాహనంపై సూర్యాపేట నుంచి ధర్మారం గ్రామానికి వచ్చాడు. గ్రామంలోని ఇంటిలో తల్లిదండ్రులు నివసిస్తుండగా, అక్కడికి వెళ్లకుండా గ్రామశివారులోని తన పొలానికి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు సూర్యాపేటలోని సమీప బంధువుకు ఫోన్ చేసి ఉరేసుకుంటున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. బంధువులు ఉదయం నాలుగు న్నర గంటలకు వచ్చేసరికి పొలంలో ఉన్న వేపచెట్టుకు ఉరేసుకుని ఉన్నాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ నాగభూషణం, పెన్‌పహాడ్ ఎస్ఐ వెంకన్నగౌడ్ ఉదయం ధర్మాపురంలోని వ్యవ సాయ పొలానికి వచ్చి సైదులు మృతదేహాన్ని పరిశీలించి సిబ్బందితో ఆ గ్రామంలోకి ఇంటికి తరలించారు. పంచానామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేటలోని ప్రభుత్వం ఆసుపత్రికి పంపారు. సూర్యాపేట ఆసుపత్రిలోని మార్చురీలో సైదులు మృతదేహాన్ని అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ ఆర్ఐ నారాయణరాజు పరిశీలించి సంతాపం ప్రకటించి, సైదులుకు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియలు, దహన సంస్కారాల సైదులు కుటుంబ సభ్యులకు రూ.20వేలను ఏఎస్పీ నాగేశ్వర్‌రావు అందజేశారు. కుటుంబ కలహాల తోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరి మీద అనుమానం లేదని సైదులు తల్లిదండ్రులు జానమ్మ, జానకిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్నగౌడ్ తెలిపారు. అయితే ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో కుటుంబంలో జరిగిన గొడవలే ఆత్మహత్యకు దారితీసినట్లు స్థానికులు చెబుతున్నారు.

కళాకారుడు వెంకటేశ్వర్లుగౌడ్‌కు పురస్కారం

గరిడేపల్లి, జనవరి 24: మండలంలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన కళాకారుడు గుండు వెంకటేశ్వర్లుగౌడ్‌కు నటవైభవ కీర్తికిరీటి -2023 అంతర్జాతీయ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయగానసభలో శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు కత్తిమండ ప్రతాప్, కొల్లు రమాదేవి ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లుకు పురస్కారం అందజేసి సన్మానించారు. కళారంగానికి చేస్తున్న సేవలను గుర్తించి తనను ఈ అవార్డుకు ఎంపిక చేశారని వెంకటేశ్వర్లుగౌడ్ తెలిపారు.

కర్పూరీ ఠాకూర్ ఆశయసాధనకు కృషి చేస్తాం

తిరుమలగిరి, జనవరి 24: బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ ఆశయసాధనకు కృషి చేస్తామని తిరుమలగిరి నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ప్రకటించారు. ఠాగూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం తిరుమలగిరిలో ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. అణగారిన వర్గాల్లో మార్పు తీసుకురావడానికి ఠాకూర్ జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పూలే అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు చిక్కులపల్లి శ్రీనివాస్, కొత్తగట్టు యాదగిరి, నెమ్మకంటి సైదులు జంపాల సోమయ్య, బుచ్చిబాబు, యాకయ్య, రవి, పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

కోదాడ, జనవరి 24: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోదాడ డివిజన్ అధికారి సలీంషరీఫ్ అన్నారు. కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బోధన అందిస్తున్న తీరును వసతి గృహ సంక్షేమ అధికారి వంగపల్లి పద్మతో కలిసి బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించి వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వసతిగృహాల్లో కల్పించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, స్వరూప, రేణుక, పద్మ, స్వాతి, ఉష పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి: ఎంపీపీ

చిలుకూరు, జనవరి 24: మండల సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎంపీపీ ప్రశాంతి అన్నారు. ఆర్థిక సంఘం నిధులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలానికి రూ.28 లక్షలు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. సమావేశంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానీమియా, ఎంపీడీవో ఈదయ్య పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ పోటీల్లో హుజూర్‌నగర్ జట్టు విజేత

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 24: జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో హుజూర్‌నగర్ జట్టు మొదటి బహుమతి సాధించింది. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆల్ ఎంప్లాయిస్ కబడ్డీ పోటీల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొనగా, హుజూర్‌నగర్ ఎంప్లాయిస్ యూనియన్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. హుజూర్‌నగర్ కెప్టెన్‌గా యూనియన్ బ్యాంక్ ఉద్యోగి రవీందర్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్‌గౌడ్, సునీల్, మస్తాన్, గోవింద్, సీతయ్య, వంశీ, శ్రీను, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, మురళి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కోదాడ టౌన్, జనవరి 24: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకుంటేనే నిజమైన ప్రజాస్వామ్యాన్ని పొందుతామని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగం.. ఓటు హక్కు ప్రాధాన్యం' అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.నాగు, రిటైర్డు ఇంటర్ విద్యాధికారి రాజారాంసింగ్, నిర్మల మేడం, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు సైదమ్మ, ఎస్ఎం రఫీ, రిటైర్డు హెడ్మాస్టర్ ప్రకాష్, రిటైర్డు సైనిక అధికారి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి: ఎంపీపీ

కోదాడ రూరల్, జనవరి 24: మండలంలో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య కలెక్టర్ వెంకట్రావును బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. మండలంలో తాగునీటి సమస్య ఉందని, రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గతంలో జరిగిన అవినీతిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో కోదాడకు వచ్చి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎంపీపీ తెలిపారు. ఎంపీపీ వెంట రెడ్లకుంట సర్పంచ్ సాతినేని లీలా అప్పారావు, కాంగ్రెస్ నాయకులు చత్రయ్య, మల్లెల పుల్లయ్య తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలోని కనకదుర్గా దేవాలయంలో గురువారం శాకాంబరి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు నరగిరినాథుని రంగభట్రాచార్యులు తెలిపారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం అన్నదానం చేస్తామన్నారు.

నేరేడుచర్ల: పట్టణానికి చెందిన ఒంగోజు శేఖర్ ఇటీవల విద్యుదా ఘాతంతో మృతి చెందగా, ఆయనకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును శేఖర్ కుటుంబానికి మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్ అందజేశారు. మరో రూ.2లక్షలను డీసీసీబీ డైరక్టర్ దొండపాటి అప్పిరెడ్డి సొంతంగా శేఖర్ తల్లి అరుణ పేరిట పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో బుధవారం నృసింహుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్దిరాల: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో బైక్ మెకానిక్ అల్లి రవి ఇటీవల మృతి చెందగా, మండల కేంద్రానికి చెందిన బైక్ మెకానిక్‌ల సంఘం, దుకాణాలు ఆధ్వర్యంలో రవి కుటుంబ సభ్యులకు రూ.50వేలను అందజేశారు. కార్యక్రమంలో సందీప్, రాజు, జనార్దన్‌పాల్గొన్నారు.

తిరుమలగిరి: స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి వ్యాసరచన పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజు బహుమతులు ఇస్తామని ప్రోగ్రాం కన్వీనర్ కందుకూరి నరేష్ తెలిపారు.

మద్దిరాల: మండల కేంద్రం నుంచి నూతనకల్‌కు తరలించిన ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంక్‌లను మద్దిరాలలో ఏర్పాటు చేయాలని ప్రజావాణి రాష్ట్ర అధ్యక్షుడు లింగిడి వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు.

చిలుకూరు: గ్రామాల్లో సాగునీటి కోసం ప్రభుత్వం వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం డీటీ కరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె.నర్సింహారావు, వేనేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన్‌కల్: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నూతన్‌కల్ సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నిర్వహించిన అన్నప్రాశన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

●పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాగారం: మండలంలోని ఈటూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపూరి సోమన్న, తాడోజు శ్రీకాంత్‌రాజ్, ఊంగూరి దామోదర్, సర్పంచ్ పేరాల సరిత, తొడుసు లింగయ్య, గంగి అవిలయ్య, సభ్యులు పాల్గొన్నారు.